క్లుప్తంగా

సిద్దారెడ్డిపల్లెలో పెద్దమ్మ తల్లికి బోనాలు


సిద్దారెడ్డిపల్లెలో బోనాలు సమర్పిస్తున్న భక్తులు

చాపాడు : మండలంలోని సిద్దారెడ్డిపల్లిల్లో గ్రామ దేవత పెద్దమ్మ తల్లికి ఆదివారం బోనాలు సమర్పించారు. గ్రామ ప్రజలంతా బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రజలు ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో కరవు కాటకాలు రాకుండా పాడి పంటలతో తలతూగాలని కోరారు. నాగాయపల్లె గ్రామంలో పెద్దమ్మ తల్లికి స్థానికులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు.

వైభవంగా జ్యోతి మహోత్సవం


చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం

కాశినాయన : మండలంలోని ఆకులనారాయణపల్లెలో శనివారం అర్ధరాత్రి వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం నిర్వహించారు. జ్యోతులు దేదీప్యమానంగా వెలుగొందాయి. ఈ మహోత్సవంలో తొగటవీర క్షత్రియులు చేసిన విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులు జ్యోతులు తలపై పెట్టుకుని భక్తిపాటలు పాడుకుంటూ మేళతాళాలతో మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ జ్యోతి ఉత్సవాల్లో మండలంలోని పలు గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక లక్ష్య కార్డియాక్, కంటి ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 48 మంది పేద ప్రజలకు ఉచిత కంటి, గుండె జబ్బులకు డాక్టర్లు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి 38 మంది రోగులను పరీక్షించారు. వారిలో 18 మందికి ఉచితంగా ఈసీజీ, 8 మందికి ఉచితంగా గుండె స్కానింగ్ పరీక్షలు చేసి తగు సూచనలు చేశారు. డాక్టర్ హరిత కంటి వైద్య పరీక్షలు చేసి జాగ్రత్తలను, సూచనలు తెలిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం


నిత్యావసర వస్తువులు అందజేస్తున్న రవిప్రకాష్‌రెడ్డి

పోరుమామిళ్ల : ఇటీవల రోడ్డు ప్రమాదంలో పుల్లివీడుకు చెందిన ఖాజావల్లి మృతి చెందగా, బాదుల్లా కుడికాలు పోగొట్టుకున్నాడు. రెండు కుటుంబాలు పేదరికంలో ఉన్నాయి. పోరుమామిళ్లకు చెందిన మదర్ థెరెసా ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి(రంగసముద్రం సర్పంచ్), గిరిప్రణీత్‌రెడ్డి, ఆదివారం ఆ రెండు కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. తమ ఫౌండేషన్ ద్వారా ప్రతి నెల నిత్యావసర వస్తువులు అందచేస్తామన్నారు. పుల్లివీడు సర్పంచ్ రఘునాథరెడ్డి రెండు కుటుంబాలకు చెరో రూ. 5 వేలు అందజేశారు. వారి వెంట జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నియామకం


బాషా

రాజుపాళెం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాజుపాళెం మండల యూత్ లీడర్‌గా తక్కశిల బాషా నియమితులయ్యారు. తనను నియమించిన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాజీ, సంఘం నాయకులకు తక్కశిల బాషా కృతజ్ఞతలు తెలిపారు. నూర్ బాషా/దూదేకుల కులస్తుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

అరుళయ్య సేవలు ఆదర్శనీయం

కడప కల్చరల్ : బిషప్ అరుళయ్య చేసిన సేవలు జిల్లా క్రైస్తవ లోకానికి ఆదర్శంగా నిలిచాయని శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ అన్నారు. ఆదివారం అరుళయ్య 48వ బిషప్ పట్టాభిషేక వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించారు. ఆయన ఘాట్ వద్ద సంస్థ సభ్యులతో కలిసి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు


ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు


సందేశం వినిపిస్తున్న పాస్టర్ వినయ్ కుమార్


రాజుపాళెం : ఏసు శిలువ ఊరేగింపు


ప్రార్థనలు నిర్వహిస్తున్న ప్రెస్బిటర్ స్వరాజ్‌జీవన్‌బాబు

మైదుకూరు : స్థానిక శాంతినగర్‌లోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. సంఘ గురువు వినయ్ కుమార్ క్రీస్తు పునరుత్థానం, మానవ జీవితంలో నిరీక్షణ కలుగ చేసిందని ఈ సందర్భంగా తెలిపారు. దైవ సందేశాన్ని అందించారు. శాంతినగర్ సంఘ సభ్యులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని సీఎస్ఐ షాలోమ్ టౌన్ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చాపాడులో..

చాపాడు : మండలంలోని చాపాడు, పల్లవోలు, బద్రిపల్లె, మొర్రాయిపల్లె, చియ్యపాడు, అన్నవరం, మడూరు, గుంతచీపాడు, కేతవరం, చిన్నగురువళూరు, అల్లాడుపల్లె, రాజుపాళెం గ్రామాలలోని సీఎస్ఐ చర్చీలలో ఆదివారం తెల్లవారు జాము నుంచి క్రైస్తవ సోదరులు ఈస్టర్ ప్రార్థనలు జరుపుకొన్నారు. పాపముల నుంచి ప్రజలను రక్షించేందుకు సజీవ సమాధి కాబడిన ఏసుక్రీస్తు పాపులను బాగు పరిచేందుకు తిరిగి పునరుత్థానుడయ్యారని పాస్టర్లు చర్చీర్చిలలో ఉపదేశం ఇచ్చారు.

కలసపాడు : మండలంలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని పరిపేతురు పరిపాలు చర్చిలో విచారణ గురువులు రెవ. ఆనంద్‌బాబు, ఆశీష్‌గాబ్రియేల్, పోరుమామిళ్ల రోడ్డులోని ఆర్సీఎం చర్చిలో విచారణ గురువులు కొత్తపల్లి మనోహర్, చెన్నారెడ్డిపల్లె ఆర్సీఎం ఈరిబాలస్వామిల ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలను నిర్వహించారు. కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు, స్త్రీలమైత్రి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

బద్వేలు పట్టణంలో..

బద్వేలు అర్బన్ : శిలువ వేయబడిన మూడవ రోజు యేసు పునరుత్థానుడైన సందర్భంగా క్రైస్తవ సోదరులు నిర్వహించుకునే ఈస్టర్ (క్రీస్తు పునరుత్థాన దినం) పండుగను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించుకున్నారు. సీఎస్ఐ చర్చిలో ఆ చర్చి ప్రెస్బిటర్ రెవ. స్వరాజ్‌జీవన్‌బాబు ఆధ్వర్యంలో, ఫాతిమామాత చర్చిలో విచారణ గురువులు ఫాదర్ రెవ. లక్కినేనిఆరోగ్యరాజు ఆధ్వర్యంలో, మదర్‌థెరిసా చర్చిలో విచారణ గురువులు రెవ. ఫాదర్ చిన్నప్పల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని హోసన్నా ప్రార్థనా మందిరం, మార్తోమా చర్చి, కొత్తచెరువు గ్రామంలోని పురాతన ప్రార్థనా మందిరం, బాలాయపల్లె, నందిపల్లె చర్చిలలో ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. సీఎస్ఐ చర్చి కమిటీ సెక్రటరీ కిరణ్ఎడ్వర్డ్, ట్రెజరర్ సునీల్‌కుమార్, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తుమార్గం అనుసరణీయం

యేసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతిఒక్కరు శాంతి, క్షమా, దయ, పరస్పర సహకార గుణాలతో జీవించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా ఆదివారం సీఎస్ఐ చర్చి సభ్యులు నాగదాసరి చెన్నరాయుడు ఆధ్వర్యంలో సీఎస్ఐ చర్చి వద్ద నిర్వహించిన వస్త్రదానం, అన్నదానం కార్యక్రమాల్లో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ యేసుక్రీస్తు మానవాళి పాప ప్రక్షాళన కోసం తన ప్రాణాన్ని సైతం శిలువపై విడిచి ప్రేమ, శాంతితో అహింసను జయించవచ్చని నిరూపించి తిరిగి పునరుత్థానం అయ్యారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ గోపాలస్వామి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, బూత్‌కమిటీల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, అట్లూరు మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు అడుగుజాడల్లో నడవాలి

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే రోజున సాయంత్రం ఏసుక్రీస్తును సజీవంగా భూస్థాపన చేయగా ఆయన మూడవ రోజున దైవ శక్తి వలన తెల్లవారు జామున తిరిగి పునరుత్థానం అవుతాడు. ఈసందర్భంగా పాస్టర్ సీమారాణి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఏసుక్రీస్తు అడుగుజాడల్లో నడవాలన్నారు. శిలువ వేయబడిన మూడవ రోజు ఏసుక్రీస్తు తిరిగి లేచిన దినాన్ని ఈస్టర్ పండుగగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. చర్చి ఆవరణలో ఆటల పోటీలు నిర్వహించగా గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చారు.


అనాథలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ


ప్రొద్దుటూరు కల్చరల్ : డివిజనల్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ జాకోబ్ ఫ్రాంక్

ఘనంగా వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు చర్చిలలో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రామేశ్వరంలోని సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ పండుగ సందర్భంగా తెల్లవారుజామున 4 గంటలకు ప్రత్యేక ఆరాధన మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ జాకోబ్ ఫ్రాంక్ మాట్లాడుతూ మానవాళి పాపాలను తొలగించేందుకు క్రీస్తు శిలువ వేయబడ్డారని తెలిపారు. క్రీస్తుకు శుక్రవారం శిలువ వేయగా, శనివారం మరణించి ఆదివారం ఆయన పునరుత్థానం అయిన సందర్భంగా ఈస్టర్ పండుగ నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. బైబిల్ గొప్పతనాన్ని, ఈస్టర్ పండుగ విశిష్టతను వివరించారు. ప్రార్థనలు చేసి భక్తి గీతాలు ఆలపించి క్రీస్తును స్తుతించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, క్రైస్తవులు, విశ్వాసులు పాల్గొన్నారు. అలాగే ఎస్పీజీ–1, 2, 3 చర్చిలతోపాటు పలు చర్చిల్లో ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మార్మోగిన శివనామస్మరణ


రథంపై కొలువు దీరిన గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి


రథోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తులు

వైభవంగా ముక్తిరామలింగేశ్వరస్వామి రథోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన రథోత్సవంలో భక్తులు చేసిన శివనామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది. శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి, రాజరాజేశ్వరి అమ్మవారికి, చండీ మాతకు, ఆదిశంకరాచుర్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి, హనుమత్ లింగేశ్వరుడు, అన్నపూర్ణేశ్వరికి వేకువజామున విశేష అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక అలంకరణలు చేశారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం గంగా రాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి సుందరంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. అనంతరం పురవీధుల్లో వైభవంగా రథోత్సవం కొనసాగింది. ఈ రథోత్సవంలో డప్పు వాయిద్యాల సందడి, కోలాటం, వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రథోత్సవం ఆలయం నుంచి ప్రారంభమై మధ్యాహ్నం చౌడేశ్వరి దేవి ఆలయం వద్ద ఉంచారు. తిరిగి సాయంత్రం రథోత్సవ ప్రారంభమై ఆలయానికి చేరుకుంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ప్రొద్దుటూరు ఫస్ట్ అడిషనల్ జడ్జి కె.సురేంద్రరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి, కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, ఈఓ శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక వేషధారణలో కళాకారులు

వైభవంగా అంకాలమ్మ తిరునాల


ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ తల్లి


అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మైదుకూరు : మైదుకూరులో గ్రామ దేవత అంకాలమ్మ తల్లి తిరుణాల ఆదివారం వైభవంగా జరిగింది. స్థానిక వనిపెంట రోడ్డులోని ఆలయంలో అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పూలదండలు, విద్యుద్దీపాలతో పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మేళతాళాలు, తప్పెట్లు, బాణసంచాతో బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. వేలాది మంది అంకాలమ్మ తల్లిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. ఆయంత్రం పెద్దమ్మతల్లి గద్దె వద్ద నుంచి మేళ తాళాలు, తప్పెట్లు, బాణసంచాతో అంకాలమ్మ తల్లి ఆలయం వద్దకు సిరిమాను ఉత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు.


కోలాహలంగా సిరిమాను ఉత్సవం

పోటాపోటీగా బండలాగుడు పోటీలు

గోపవరం : మండలంలోని బుచ్చనపల్లెలో అంకాలమ్మ తిరునాల ముగింపు సందర్భంగా ఆదివారం నిర్వహించిన బండలాగుడు పోటీలు పోటాపోటీగా కొనసాగాయి. ఈ పోటీల్లో ప్రొద్దుటూరుకు చెందిన వృషభాలు మొదటి స్థానంలో నిలిచి రూ.40 వేలు నగదు బహుమతిని అందుకున్నాయి. అలాగే రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.25 వేలు, నాల్గవ బహుమతి రూ.15 వేలు, ఐదవ బహుమతిని వృషభాలు గెలుచుకున్నాయి. పోటీల్లో పాల్గొన్న వృషభాల యజమానులకు ఆలయ కమిటీ వారు నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ నెల 18వ తేదీ నుండి మూడు రోజుల పాటు ఈ తిరునాల ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయాన్నే మూకుమ్మడిగా అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

మండలంలోని బుచ్చనపల్లెలో అంకాలమ్మ తిరుణాల సందర్భంగా ఆదివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. వీరి వెంట వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పించండి



ప్రభుత్వ బడుల గురించి వివరిస్తున్న చెన్నయ్య

పోరుమామిళ్ల : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని యూటీఎఫ్ ఉపాధ్యాయ బృందం ఆదివారం గ్రామాల్లో ప్రచారం చేపట్టింది. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్య ఆధ్వర్యంలో చిన్నాయపల్లె, సిద్దవరం, అగ్రహారం గ్రామాల్లో తల్లిదండ్రులను, పిల్లలను సమావేశపరచి అన్ని సదుపాయాలు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు. ఉచిత విద్య, మధ్యాహ్న భోజనము, యూనిఫామ్, బూట్లు, సాక్స్, పుస్తకాలు ప్రభుత్వ బడుల్లోనే అందుతాయన్నారు. ప్రైవేటు పాఠశాలల మోజుతో ఆర్థికంగా భారం మోయవద్దని హెచ్చరించారు.

అవినీతికి పాల్పడిన రేషన్ డీలర్‌పై చర్యలేవి

కలసపాడు : మండలంలోని కర్నంవారిపల్లె రేషన్ షాపు నెంబర్ 6 డీలర్ గత సంవత్సర కాలం నుండి మరణించిన వారి అంత్యోదయ కార్డుదారుల బియ్యాన్ని, అలాగే ఇతర రేషన్‌షాపుల్లో బయటి ప్రాంతాల్లో ఉన్న వారి రేషన్ బియ్యాన్ని యథేచ్ఛగా అవినీతికి పాల్పడి ప్రతి నెల సుమారు 6 క్వింటాళ్ళ బియ్యాన్ని స్వాహా చేశారు. ఈ విషయంపై మార్చి నెలలో రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు డీలర్‌పై విచారణ చేపట్టి ఆర్డీఓకు నివేదిక అందజేశారు. ఆ నివేదికలో డీలర్ తప్పు చేశానని ఒప్పుకున్నాడని రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ ఇచ్చాడు. అలాగే మార్చి నెలలో సాక్షి దినపత్రికలో 'పేదల బియ్యం పక్కదారి', 'పేదల బియ్యంపై కొనసాగుతున్న విచారణ', 'డీలర్‌పై జేసీకి ఫిర్యాదు' అనే శీర్షికలతో కథనాలు ప్రచురితమయ్యాయి. అయినా ఏప్రిల్‌లో అవినీతికి పాల్పడిన డీలర్‌కే రేషన్ బియ్యాన్ని ఇచ్చి అతని ద్వారా పంపిణీ చేశారు. ఇంత అవినీతికి పాల్పడిన డీలర్‌కు తిరిగి రేషన్ బియ్యం సరఫరాను ఎలా ఇస్తారని ప్రజలు అంటున్నారు. అలాగే గ్రామస్తులు కడపలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు డీలర్‌కు ఒత్తాసు పలికి ఆ డీలర్‌కే ఏప్రిల్ నెలలో రేషన్ బియ్యం పంపిణీ చేపట్టాలని ఇవ్వడం పట్ల ఎంత అవినీతి చేసినా కూటమి ప్రభుత్వం డీలర్‌కు మద్దతుగా ఉండటం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆర్డీఓ చంద్రమోహన్‌ను వివరణ కోరగా డీలర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జీవన ఎరువులపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : నేల తల్లి ఆరోగ్యంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న జీవన ఎరువులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జమ్మలమడుగు మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కొవ్వూరు గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన బయో ఫ్యాక్టర్ సంస్థ, శ్రీమహాలక్ష్మి ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాల యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు జీవన ఎరువుల ఆవశ్యకత ఎక్కువగా ఉందన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి బయో ఫర్టిలైజర్స్‌తోపాటు ఆర్గానిక్ ఎరువులను రైతులకు తెలిపేలా డీలర్లు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కువగా రసాయన ఎరువులు వాడటం వల్లే నేల ఆరోగ్యం చెడిపోవడంతో పాటు రైతుకు పెట్టుబడి ఎక్కువ అవుతుందన్నారు. జీవన ఎరువుల ద్వారా భూమిలో మొక్కకు మంచి చేసే బ్యాక్టీరియ వృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు, దువ్వూరు, ఎర్రగుంట్ల మండలాల వ్యవసాయాధికారులు శివశంకర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, బయో ఫ్యాక్టర్ సీఈఓ డాక్టర్ ఎల్ఎన్ రెడ్డి, ఎండీ మురళి, జోనల్ మేనేజర్ సత్యనారాయణ, రీజనల్ మేనేజర్ వెంకటరాముడు, మహాలక్ష్మి ఫర్టిలైజర్స్ ప్రొపరైటర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో నైపుణ్యం సాధించాలి


తైక్వాండోలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : క్రీడాకారులు తైక్వాండోలో నైపుణ్యం సాధించాలని అనంతపురం జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సాయిబాబా పేర్కొన్నారు. స్థానిక శివాలయం సమీపంలోని నందినీ క్లాత్ మార్కెట్ థర్డ్ ఫ్లోర్‌లో ఆదివారం మై స్పేస్ తైక్వాండో అకాడమీ ఇండోర్ ఆడిటోరియం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం క్రీడా సాధన చేసి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. తైక్వాండోలో రాష్ట్ర, జాతీయ, అంతార్జతీయ స్థాయిలో రాణించిన వారికి విద్య, ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ఇండోర్ ఆడిటోరియంలో సాధన చేయడం ద్వారా సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మై స్పేస్ తైక్వాండో అకాడమీ డైరెక్టర్ మాస్టర్ సలీం, మాస్టర్ సలీం తల్లి బషిరున్నీసా, కడప జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ నాయబ్‌రసూల్, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర గౌరవ సభ్యుడు బేపారి జాకీర్ అహ్మద్, చీఫ్ కోచ్ మహబూబ్ బాషా, ఇన్‌స్ట్రక్టర్లు రియాజ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

రాజుపాళెం నుంచి తిరుమలకు పాదయాత్ర


రాజుపాళెం నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న భక్తులు

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెం నుంచి తిరుమలకు ఆదివారం పాదయాత్రగా దాదాపు 80 మంది భక్తులు వెళ్లారు. ముందుగా వారంతా గ్రామంలోని కోదండ రామాలయం, శివాలయంలో టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. ఇలా పాదయాత్రగా తిరుమలకు వెళ్లడం ఏడవవసారి అని పాదయాత్ర కమిటీ సభ్యులు తెలిపారు. పాదయాత్రకు వచ్చే భక్తులకు దాతలు, భక్తుల సహకారంతో టిఫిన్, భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 25వ తేదీ శుక్రవారం సాయంత్రానికి తిరుమలకు చేరుకుంటామని, శనివారం కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని వస్తామన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణలో అప్రమత్తతే ప్రధానం


మంటలను ఆర్పే యంత్రాల వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్‌ఆఫీసర్


గ్యాస్ సిలిండర్లకు మంటలు అంటుకుంటే ఎలా ఆర్పాలో చూపిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

బద్వేలు అర్బన్ : అగ్నిప్రమాదాల నివారణలో అప్రమత్తతే ప్రధానమని బద్వేలు ఫైర్‌ఆఫీసర్ ఎం.చంద్రుడు తెలిపారు. ఆదివారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ప్రజలకు, విద్యార్థులకు ఈ అంశంపై ఆయన అవగాహన కల్పించారు. జాగ్రత్తలు పాటిస్తే కొంతమేరైనా ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. అలాగే ఇళ్ల నుంచి బయటకు వెళ్లేటపుడు టి.వి. స్విచ్‌లు, ఏసీలు మొదలగు విద్యుత్ పరికరాలను స్విచ్ఛాఫ్ చేసి వెళ్లడం క్షేమమని వివరించారు. ప్రజలు కూడా సహకారం అందించినపుడే అగ్నిప్రమాదాలు నివారించవచ్చన్నారు. అనంతరం అగ్నిమాపక సేవలు, అగ్ని ప్రమాద నిరోధక యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్‌మెన్లు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

మైదుకూరు: మైదుకూరులో అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బి.జయరాజు ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌బీ సురేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రవికళ్యాణ్ కేంద్రం పరిసరాల్లోని ప్రజలు, విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు. వేసవిలో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


పరికరాల వినియోగంపై వివరిస్తున్న జయరాజు


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఎర్రన్న కొట్టాలులో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రం అధికారి రఘునాథ్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గ్యాస్ సిలిండర్ ద్వారా మంటలు వచ్చినప్పుడు ఎలా ఆర్పాలో ప్రయోగం చేసి ప్రజలకు వివరించారు. అనంతరం అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఫైర్ ఫైటింగ్ చేసే క్రమంలో ఫైర్ సిబ్బంది వారి భద్రత చూసుకుంటూ అగ్ని ప్రమాదంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

పోరుమామిళ్ల : పట్టణంలో వృత్తి పనులు చేసుకుంటున్న వారికి, వివిధ వర్గాల కార్మికులకు ఆదివారం అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి నజీర్ మహమ్మద్ ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి? ప్రమాదాలు జరిగితే వాటి నుండి ఎలా కాపాడుకోవాలి? ప్రమాదాల్లో ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరగకుండా పాటించాల్సిన పద్ధతులు వివరించారు. సమావేశంలో కరపత్రాలు పంపిణీ చేశారు.